**కామెడీ కథ**

# తిరకాసు

ఆదివారం.

సమయం మధ్యాహ్నం ఒంటిగంట కావస్తోంది. ఇందుమతి చేసిన స్పెషల్ వంటకాలతో సుష్టుగా భోజనం చేసి, భుక్తాయాసం తీర్చుకుంటూ డ్రాయింగ్‌రూమ్‌లో టీవీ ముందు సెటిల్ అయ్యాడు విశ్వనాథం.

టీవీలో 'సాహసం చేయరా ఢింభకా' అనే వినూత్న కార్యక్రమం ప్రసారమవుతోంది. నున్నగా గీయించుకున్న బోడిగుండు మీద నిమ్మకాయ పెట్టుకుని నాలుగు ఫర్లాంగులు అది పడిపోకుండా నడిస్తే వెయ్యి రూపాయలిస్తానంటూ టైట్ జీన్సు వేసుకున్న యాంకర్ ఒక చేత్తో మైకు, మరో చేత్తో వెయ్యి రూపాయలు పట్టుకుని సవాల్ చేస్తోంది.

టీవీ చూస్తున్న పిల్లలిద్దరూ ఎవరు సాహసం చేసి వెయ్యి రూపాయలు గెలుచుకుంటారా అని ఉత్సుకతగా చూస్తున్నారు. ఇందుమతి అంతే సరేసరి.

''మీరు కూడా చక్కా గుండు గీయించుకుని నెత్తిమీద నిమ్మకాయ పెట్టుకుని నాలుగడుగులు వేస్తే మనకి కూడా వెయ్యి రూపాయలొస్తాయి కదండీ?'' అంది విశ్వనాథంతో.

''అవును నాన్నా, నువ్వు కూడా ఆ ప్రోగ్రాంలో పార్టిసిపేట్ చెయ్యచ్చు కదా నాన్నా'' అంటూ పిల్లలిద్దరూ వంత పాడసాగారు.

అంతలో కాలింగ్ బెల్ మ్రోగింది.

''అమ్మా... గమినీ టీవీ'' అన్నాడు విశ్వనాథం పెద్దకొడుకు బంటి.

ఇందుమతి విశ్వనాథం చేతిలోంచి రిమోట్ లాక్కుని చూస్తున్న ఛానెల్ మార్చేసి గమినీ టీవీ ఛానల్ పెట్టింది.

ఆమధ్యనా టీవీ ఛానల్ వాళ్ళు ఒక వెరైటీ ప్రోగ్రాం పెట్టారు.

హఠాత్తుగా ఆ టీవీ ఛానల్ వాళ్ళు కెమెరాతో సహా ఏదో ఒక ఇంటి తలుపు తడతారు. వాళ్ళు వచ్చేసరికి ఇంట్లో వాళ్ళు టీవీలో వస్తున్న వాళ్ళ ఛానల్ చూస్తూ వుంటే వాళ్ళకి పదివేల రూపాయల బహుమతి ఇస్తామని ప్రకటించారు.

అప్పట్నుంచీ కాలింగ్ బెల్ మ్రోగగానే ఇంట్లో ఇదే తంతు.

అంతకు ముందు అదే టీవీ ఛానల్‌వాళ్ళు ఇళ్ళకి టెలిఫోన్ చేసి, ఫోన్ ఎత్తగానే 'హలో గమినీ' అంటే ఐదువేలు ఇస్తామని ప్రకటించారు. అప్పటినుంచీ ఇంట్లో వాళ్ళందరూ ఫోన్ ఎత్తగానే 'హలో గమినీ' అనడం అలవాటుగా చేసుకున్నారు.

అదే అలవాటులో తన ఆఫీసర్ ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తగానే 'హలో గమినీ' అని అనేసి ఆయనతో- ''ఆఫీస్ ఎగ్గొట్టి ఇంట్లో కూర్చుని టీవీ చూస్తున్నావా'' అంటూ తల వాచేలా చీవాట్లు తిన్నాడు విశ్వనాథం.

అలాంటి కొన్ని చేదు అనుభవాల తర్వాత ఆ అలవాటు మానేసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ ఈ కొత్తకార్యక్రమం.

ఇందుమతి 'వచ్చింది నిజంగా టీవీ వాళ్ళేనేమో' అన్న అనుమానంతో మేకప్ సవరించుకుని మరీ వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా ఎన్నికల ప్రచారానికి వచ్చిన రాజకీయ నాయకుడిలా నవ్వుతూ కనిపించాడు గోపాలకృష్ణ- ఒక నలుగురు కుర్రాళ్ళని వెంట పెట్టుకుని.

ఇందుమతి నీరసంగా ''మీరా రండి'' అంటూ వాళ్ళని లోపలికి ఆహ్వానించింది.

వాళ్ళంతా బిలబిలమంటూ లోపలికొచ్చేసారు.

గోపాలకృష్ణ వంక ఆశ్చర్యంగా చూసాడు విశ్వనాథం. అతను అప్పుడప్పుడు వాళ్ళింటికి రావడం కొత్తేమీ కాదు కానీ ఆవేళప్పుడు, అందులోనూ అంతమందిని వెంటపెట్టుకుని రావడమే ఆశ్చర్యం.

వస్తూనే రెండు చేతులూ జోడించి ''నమస్కారం అన్నయ్యా'' అన్నాడు.

'మనిషి వేషమే కాదు, భాషా వ్యవహారం కూడా క్రొత్తగానే వుందే' అనుకున్నాడు విశ్వనాథం. అయినా అదేం పట్టించుకోకుండా ''రావోయ్ గోపాలకృష్ణా... రా... కూర్చో'' అన్నాడు వచ్చిన వాళ్ళందరికీ కుర్చీలు చూపిస్తూ.

కానీ అతడూరుకున్నట్లుగా ఇందుమతి ఊరుకోలేదు.

''ఏమిటోయ్ గోపాలకృష్ణా... వేషంతోపాటూ భాష కూడా మార్చేసావు హఠాత్తుగా? ఇన్నాళ్ళ స్నేహంలో ఆయన్ని నువ్వు అన్నయ్యా అనడం కానీ, నమస్కారం చెయ్యడం కానీ నేను ఎప్పుడూ చూడలేదు'' అందామె అతని వేషాన్ని తేరిపార చూస్తూ.

అతడు ఎప్పటిలా జీన్సు పేంటూ టీషర్టు వేసుకోలేదు. లాల్చీ, పైజమా వేసుకున్నాడు. ఫంక్ కటింగ్ తీసేసి బుద్ధిమంతుడిలా జుట్టు దగ్గరకి కట్ చేయించుకున్నాడు.

నుదుటి మీద పావలా కాసంత కుంకుమ బొట్టు, వీభూదీ పెట్టుకున్నాడు.

ఆమె ప్రశ్నకి గోపాలకృష్ణ కొంచెం ఇబ్బందిగా చూసాడు.

''పెద్దవాళ్ళని గౌరవించడంలో తప్పేముంది వదినా? ఇన్నాళ్ళూ మనసులో వున్న గౌరవం ఇప్పుడు మాటల్లో కనపడింది. అంతే'' అన్నాడు.

''వీరు మా మిత్రులు'' అంటూ తన కూడా వచ్చిన వాళ్ళని పరిచయం చేసాడు గోపాలకృష్ణ అదే భాషలో.

ఇందుమతి లేచింది.

''ఎక్కడికి వెళుతున్నారు వదినా?'' అడిగాడు గోపాలకృష్ణ.

''మీ మిత్రులకి కొంచెం తేనీరు తెద్దామని... '' వ్యంగ్యంగా అని వంటింట్లోకి వెళ్ళింది.

''అన్నయ్యా, మేము మన కాలనీలో ఒక సత్కార్యాన్ని చెయ్యాలని తలపెట్టాం. అందుకు మీ ఆశీర్వచనం కావాలి'' ఆమె వంటింట్లోకి వెళ్ళాక అన్నాడు గోపాలకృష్ణ.

అతనితో పాటు వచ్చిన కుర్రాళ్ళు కూడా డిటో అన్నట్లుగా ముఖం పెట్టారు.

''తప్పకుండా. ఇంతకీ విషయం ఏమిటో చెప్పండి'' అన్నాడు విశ్వనాథం.

''ఈ సంవత్సరం మేమంతా కలిసి మన కాలనీలో వినాయకుడ్ని నిలబెడదాం అనుకుంటున్నాం''


''వినాయకుడ్ని నిలబెడతారా? ఎందులో? మన కాలనీ ప్రెసిడెంటు ఎలక్షన్స్‌లోనా?'' వంటింట్లోంచి ఓ మారు బయటికి వచ్చి అడిగింది ఇందుమతి. ఆమె దృష్టంతా ఇక్కడే ఉంది.

''నిలబెట్టడం అంటే అది కాదు వదినమ్మా. వినాయక చవితికి మన కాలనీలోనే పందిరి వేసి వినాయకుడ్ని ప్రతిష్ఠించి, నవరాత్రులు జరుపుదామనుకుంటున్నాం'' అన్నాడు అతను.

ఆమె అతని వంక మరింత ఆశ్చర్యంగా చూసింది.

''ఏమిటోయ్ గోపాల్... మాట్లాడుతున్నది నువ్వేనా అసలు? నిన్నటిదాకా దేవుడూ లేడు, దెయ్యమూ లేదు అంటూ కబుర్లు చెప్పావు. ఇవాళ వినాయక నవరాత్రులు జరిపిస్తానంటున్నావా? ఏమిటీ నాటకం?'' నిలదీసినట్లుగా అడిగింది.

ఆమె ప్రశ్నకి గోపాలకృష్ణ మళ్ళీ ఇబ్బంది పడ్డట్టుగా ముఖం పెట్టాడు.




పారపాటున వదినా... మనకి కనిపించేదంతా నిజం కాదు. అలాగే మనకి కనిపించడం లేదు కదా అని దేవుడు లేడనుకోవడం కూడా మూర్ఖత్వమే'' అన్నాడు.

''మరిన్నాళ్ళూ దేవుడున్నాడనుకోవడం మూర్ఖత్వం అన్నావు?''

''నిజమే వదినా..కానీ అది అజ్ఞానమనీ, దేవుడు లేడు అనుకోవడమే అసలైన మూర్ఖత్వమనీ మొన్నవే స్వామి సదానంద బాబా గారి ఫేవరేట్ గురుపీ టీవీలో చెప్పారు. చూళ్ళేదా?'' అన్నాడు ఆమె హెక్నాస్ మీద దెబ్బకొడుతూ.

ఆమె మళ్ళీ వంటింట్లోకి వెళ్ళింది.

''అదన్నయ్యా విషయం. నేను ఏం చేసినా ముందుగా నీ ఆశీర్వచనం తీసుకోవడం అలవాటు. అందుకే ఈ విషయంలో కూడా నన్ను ఆశీర్వదించాలి నువ్వు'' గబగబా చెప్పేసేడు గోపాలకృష్ణ. మళ్ళీ ఇందుమతి వంటింట్లోంచి బయటికొచ్చే ప్రమాదం వుందని.

''తప్పకుండా. నా ఆశీర్వచనం నీకెప్పుడూ వుంటుంది. నీకింత మంచి బుద్ధి పుట్టడమే గొప్ప విషయం'' అంటూ విశ్వనాధం ఇంకేదో చెప్పబోయేంతలోనే ఆ కుర్రాళ్ళలో ఒకతను తను కూడా తెచ్చిన పుస్తకంలో చకచకా ఏదో రాసి సర్రున చింపి గోపాలకృష్ణకి ఇచ్చాడు.

గోపాలకృష్ణ ఆ పచ్చ కాగితాన్ని విశ్వనాధం చేతిలో పెట్టాడు.

''ఏమిటిది'' ఆశ్చర్యంగా అడిగాడు విశ్వనాధం.

''రశీదు'' అన్నాడు గోపాలకృష్ణ.

''దేనికి?''

''నీ పేర్న నూట పదహార్లు చందా రాసారు మావాళ్ళు. దాని రశీదు''

''నూట పదహార్లా..అంతెందుకు? ఓ పదో..పాతికో'' ఇబ్బందిగా అన్నాడు విశ్వనాధం.

''నీలాంటి పెద్ద మనుషులు అనాల్సిన మాటలు కావన్నయ్యా అవి'' అన్నాడు గోపాలకృష్ణ అతన్ని మరింత ఇబ్బంది పెడుతూ.

తప్పదన్నట్లుగా పర్సులోంచి డబ్బులు తీసి ఇచ్చాడు విశ్వనాధం.

''అంకుల్... మరి వినాయక చవితి పందిర్లో మైకు పెడతారా?'' అడిగాడు బంటీ వాళ్ళని.

''పెడతాం బాబూ..ఎందుకూ?''

''ఎంచక్కా రోజూ నేనా మైకులో పాటలు పాడతా'' ఉత్సాహంగా అన్నాడు బంటీ.

''ఛీ... వెధవా... నీ పాటలు ఇంట్లో మేమే వినలేకపోతుంటే ఇంకా మైకులో పాడతావా?'' విసుక్కున్నాడు విశ్వనాధం.

''తప్పేముంది అన్నయ్యా. వినేది మనమేగా? తప్పకుండా పాడుదువుగాని బాబూ'' అంటూ విశ్వనాధానికి మరోసారి నమస్కారాలు చేసి బయలుదేరారు వాళ్ళంతా.

''ఏరీ..మీ మిత్రులు వెళ్ళిపోయారా?'' టీ తీసుకొచ్చిన ఇందుమతి అడిగింది.

''వెళ్ళిపోయారు. ఇదుగో ఈ రశీదు దాచు'' అన్నాడు విశ్వనాధం ఆ చీటీ ఆమెకిచ్చి.

''ఏమిటీ... నూటపదహార్లు చందా ఇచ్చారా వాళ్ళకి?'' రశీదు చూసి అడిగిందామె.

''పోనీలేవే..ఏదో మంచి పనికంటున్నారు

ఆకునూరి మురళీకృష్ణ

కదా?'' అన్నాడు విశ్వనాథం.

''ఆ గోపాలకృష్ణ సంగతి మీకు తెలియదండీ. నిన్నటిదాకా లేని దైవభక్తి హఠాత్తుగా ఇవాళా పుట్టుకు వచ్చింది? ఇందులో ఏదో మోసం వుంది. వినాయకుడి నవరాత్రులు చేస్తానని అందరి దగ్గరా ఇలా సొమ్ములు వసూలు చేసి జెండా ఎత్తేస్తాడు. మొన్నామధ్య 'తెలియని టోపీ' సింగిల్ ఎపిసోడ్‌లో ఇలాంటి మోసాలనే చూపించారు'' అంది ఇందుమతి.

''కానీ గోపాలకృష్ణ ఎక్కడికి పోతాడు? మన కాలనీ వాడేగా?'' అన్నాడు విశ్వనాథం.

''ఏమో... నవరాత్రులు జరుగుతాయని నాకు మాత్రం నమ్మకం లేదు. చూస్తూ వుండండి. ఇదో పెద్ద స్కాం అవుతుంది''

విశ్వనాథానికి కూడా ఇందులో ఏదో తిరకాసు వుందనిపించింది. గోపాలకృష్ణని పట్టుకుని అదీ యాలనుకున్నాడు.

కానీ ఆ తర్వాత అతనికెపుడూ గోపాలకృష్ణ ఒంటరిగా దొరకలేదు.

తన వెంట ఆ కుర్రాళ్ళనేసుకుని కాలనీలో ఇళ్ళన్నీ తిరిగి చందాలు వసూలు చేశాడు.

## భాగ్యశ్రీ పునఃప్రవేశం

**మైనే ప్యార్ కియా సినిమాతో సంచలనం సృష్టించిన భాగ్య శ్రీ దాదాపుగా సినిమాలకు దూరమై పోయిందేమో అనుకుంటున్న కాలంలో హిందీలో నిర్మిస్తున్న 'మా సంతోషి మా'లో కీలకమైన పాత్రని పోషిస్తోంది. చాలాకాలం తరువాత ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాపై ఆమెతో పాటు, అభిమానులు కూడా ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఏమవుతుందో వేచి చూద్దాం.**

చందాలు ఇచ్చిన వాళ్ళందరికీ రశీదులు ఇచ్చాడు.

కాలనీలో షాపుల వాళ్ళ దగ్గర్నుంచి చందాలు వసూలు చెయ్యడానికి ఇద్దరు గూండాల్లాంటి మనుషులని కూడా తీసుకు వచ్చాడు.

ఇందుమతి అతడ్ని అనుమానించింది. కానీ, కాలనీ వాళ్ళెవరికీ అతని మీద అనుమానమే రాలేదు. ఎవరికి తోచినంత వాళ్ళు చందాలు ఇచ్చారు. కొందరు భక్తిగా, కొందరు మొహమాటంగా, కొందరు తిట్టుకుంటూ

బాగానే వసూలై వుండాలి.

ఇందుమతికి మాత్రం పరమ నాస్తికుడైన గోపాలకృష్ణ గణపతి నవరాత్రులు జరిపిస్తాడంటే నమ్మబుద్ధి కావడం లేదు.

★ ★ ★

అనుకున్న రోజు రానే వచ్చింది.

ఇందుమతి, విశ్వనాథంల అనుమానాలని పటాపంచలు చేస్తూ కాలనీలో వినాయకచవితి నాడు వైభవంగా నవరాత్రి ఉత్సవాలని ప్రారంభించాడు గోపాలకృష్ణ.

మొదటిరోజు పూజకి వాళ్ళిద్దర్నే పిలిచి, దగ్గరుండి మరీ తీసుకెళ్ళాడు. విఘ్నేశ్వరుడి పూజ, కథాశ్రవణం, ప్రసాదాలు అన్నీ శాస్త్రోక్తంగా జరిపించాడు.

కాలనీ వాళ్ళంతా గోపాలకృష్ణని తెగ మెచ్చుకున్నారు.

తొమ్మిది రోజులూ పూజలు, భజనలు, లైటింగు, రికార్డులు, రాత్రిపూట వినోద కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరిగాయి. అన్నీ దగ్గరుండి తనే జరిపించాడు గోపాలకృష్ణ.


సాయంత్రం పూట పందిరి దగ్గర మైకులో అనుకున్నట్లుగా బంటీ, అతని ఫ్రెండ్సూ, ఇంకా కాలనీలోని పిల్లలు వచ్చీరాని పాటలని కర్ణకఠోరంగా పాడి సంబరపడ్డారు.

ఇందుమతి ఫేవరేట్ టీవీ ఛానల్ వాళ్ళు వాళ్ళ కాలనీలోని వినాయకుడి పందిర దగ్గరకొచ్చి 'హలో ఎలా వున్నారు?' కార్యక్రమం నిర్వహించడంతో ఇందుమతితోపాటూ కాలనీలోని ఆడవాళ్ళందరి ఆనందానికి అంతులేకుండా పోయింది.

మొత్తానికి నవరాత్రులు వైభవంగా ముగిసిపోయాయి.

★ ★ ★

విశ్వనాథానికి మాత్రం ఇదంతా మింగుడు పడకుండా వుంది.



గోపాలకృష్ణలో అంత మార్పు, దైవభక్తి ఎలా వచ్చాయో అర్థం కావడం లేదు. అతన్ని అడుగుదామంటే చాలా బిజీగా వున్నాడు. చివరికి నిమజ్జనం అయిన మర్నాడు దొరికాడు ఒంటరిగా వాళ్ళింట్లో.

ఏవో లెక్కలు చూసుకుంటున్నాడు అతడు వెళ్ళేసరికి.

విశ్వనాథాన్ని చూడగానే ''రా అన్నయ్యా..నువ్వు ఆశీర్వదించావు, ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిపించాను. చాలా కృతజ్ఞతలు'' అన్నాడు.

''నీ నక్క వినయాలకి సంతోషించాను కానీ, ముందు అసలు విషయం చెప్పు. సస్పెన్స్‌తో చచ్చిపోతున్నాను'' అన్నాడు విశ్వనాథం కూర్చుంటూ.

''ఏ విషయం?''

''హఠాత్తుగా వచ్చిన దైవభక్తి గురించి. ఇన్నాళ్ళూ దేవుడు లేడన్నావు?''

''ఇప్పుడూ అదే అంటున్నాను నేను. నిజంగానే దేవుడు లేడు'' తాపీగా అన్నాడు.

''ఏమిటీ?'' ఉలిక్కిపడ్డాడు విశ్వనాథం.

''అవును. నా నమ్మకంలో మార్పేం లేదు''

''మరీ పూజలూ ఉత్సవాలూ అవీ?''

''నీకు తెలియందేముంది? నిరుద్యోగిని కదా? చేతిలో పనేం లేదు. కాలక్షేపం కోసం''

''నిజమా?''

''నీ దగ్గర కాబట్టి నిజం చెబుతున్నాను. దేవుడు లేడు. కేవలం భక్తిమాత్రమే వుంది. అందరూ ముక్తికోసం భక్తిని నమ్ముకుంటే నేను భుక్తి కోసం భక్తిని నమ్ముకున్నాను''

విశ్వనాథానికి విషయం అర్థమై పెదవుల మీద చిరునవ్వు వెలిసింది.

''బావుంది. ఎంత మిగిలిందేమిటి?'' అడిగాడు.

''ఖర్చులన్నీ పోనూ ఐదారు వేలదాకా మిగిలింది. ఇదేదో బానే వున్నట్లనిపిస్తోంది. దసరాకీ, శ్రీరామనవమికీ కూడా మన కాలనీలో ఉత్సవాలు జరిపిద్దామనుకుంటున్నాను. కానీ మన హిందూ పండుగలు చూస్తుంటే నాకు ఒకందుకు బాధగా వుంటుంది.''

''ఎందుకు?''

''సంక్రాంతికీ ఉగాదికీ కూడా నవరాత్రులు ఎందుకు చెయ్యరా అని'' అంటూ నవ్వేడు గోపాలకృష్ణ.

'అమ్మ గోపాలకృష్ణా!' అనుకున్నాడు విశ్వనాథం.